RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | సోమవారం 20 జనవరి 2025

సంపుటి: 2 | సంచిక: 251 | పేజీలు: 4 | వెల: రూ.5/-



## పేలిన పెట్రోల్ ట్యాంకర్

77 మంది దుర్మరణం


2



# హైదరాబాద్‌కు పెట్టుబడుల పంట

## రూ.450 కోట్లతో విశ్వనగరంలో ఐటీ పార్క్ నిర్మాణం

## క్యాపిటల్ ల్యాండ్ గ్రూప్ ప్రతినిధులతో సీఎం రేవంత్ బృందం భేటీ



**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగపూర్ పర్యటనలో భాగంగా హైదరాబాద్‌లో రూ.450 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు క్యాపిటల్ ల్యాండ్ సంస్థ ముందుకొచ్చింది. సీఎం సారథ్యంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సింగపూర్‌లో మూడో రోజు పర్యటిస్తోంది. అందులో భాగంగా క్యాపిటల్ ల్యాండ్ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సహా రాష్ట్ర బృందం సమావేశమైంది. అనంతరం పెట్టుబడులకు ముందుకొచ్చినట్లు క్యాపిటల్ ల్యాండ్ ప్రకటించింది. ఈ మేరకు సంస్థ హైదరాబాద్‌లో రూ.450 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. దాంతో నగరంలో లక్ష చదరపు అడుగల విస్తీర్ణంలో ఐటీ పార్క్‌ను క్యాపిటల్ ల్యాండ్ నిర్మించనుంది. గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు, బ్లూ-చిప్ కంపెనీల డిమాండ్‌కు అనుగుణంగా ఈ కొత్త ప్రాజెక్టును చేపట్టనుంది. హైదరాబాద్‌లోని ప్రముఖ బిజినెస్ పార్కులైన ఇంటర్నేషనల్ టెక్ పార్క్ హైదరాబాద్, ఎవ్యాన్స్ హైదరాబాద్, సైబర్ పెరల్ వంటివి క్యాపిటల్ ల్యాండ్ నిర్మించినవే. వ్యాపార వృద్ధిలో హైదరాబాద్ దూసుకెళ్తోంది : హైదరాబాద్ లో ఈ ఏడాది అందుబాటులోకి తెచ్చే విధంగా 25 మెగా వాట్ల డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ఇప్పటికే క్యాపిటల్ ల్యాండ్ ప్రకటించింది. ఇంటర్నేషనల్ టెక్ పార్క్ హైదరాబాద్ రెండో దశ నిర్మాణాన్ని ఈ ఏడాది ప్రారంభించి 2028కి పూర్తి చేసేలా ప్రణాళిక చేస్తోంది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ప్రగతి శీల విధానాలతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వ్యాపార వృద్ధిలో హైదరాబాద్ దూసుకెళ్తోందని క్యాపిటల్ ల్యాండ్ ప్రతినిధులు తెలిపారు. బిజినెస్ హబ్‌గా హైదరాబాద్ స్థానాన్ని మరింత బలోపేతం చేయడంలో ఈ నిర్ణయం ఒక మైలురాయి కానుందని వివరించారు.

### ఐక్యత, సమానత్వం అసాధారణ సంగమంగా

# మహాకుంభ మేళా

## ప్రధాని నరేంద్ర మోదీ





**న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు):** మహాకుంభ మేళా ఐక్యత, సమానత్వం అసాధారణ సంగమంగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయంలో ఎక్కడా వివక్షత, కులతత్వం లేదన్నారు. ప్రధాని ఆదివారం 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమంలో ప్రసంగించారు. మహాకుంభ మేళాలో యువత పాల్గొనడంపై హర్షం వ్యక్తం చేశారు. యువతరం ఆచార వ్యవహారాలను తెలుసుకున్నప్పుడే మన మూలాలు బలపడుతాయన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమానికి ప్రపంచ దేశాల నుంచి వస్తున్న ఆదరణ భారతీయులకు గర్వకారణమన్నారు. మహాకుంభ మేళా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచిందన్న ప్రధాని.. అన్ని ప్రాంతాల, వర్గాల ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకువచ్చిందన్నారు. ఈ సందర్భంగా జనవరి 25న జరుపుకునే జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ప్రస్తావించారు. ఈ రిపబ్లిక్ డే చాలా ప్రత్యేకమైందని.. ఈ సంవత్సరం భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతుందని తెలిపారు. పవిత్రమైన రాజ్యాంగాన్ని మనకు అందించిన రాజ్యాంగ పరిషత్‌లోని గొప్ప వ్యక్తులకు తలవంచి నమస్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఎన్నికల ప్రక్రియను ఎప్పటికప్పుడు ఆధునీకరించి.. పటిష్ఠం చేస్తుందన్నారు. ప్రజాశక్తిని బలోపేతం చేయడానికి సాంకేతికతను ఉపయోగిస్తూ.. నిష్పక్షపాతంగా పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తుందని కొనియాడారు. అలాగే, అయోధ్య రామమందిరం వార్షికోత్సవంపై వ్యాఖ్యానించారు. వాస్తవానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రతి నెలా చివరి ఆదివారం మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రసంగిస్తారు. ఈ నెల చివరి ఆదివారం రోజున రిపబ్లిక్ డే నేపథ్యంలో మూడో ఆదివారం రోజున మన్ కీ బాత్ 118వ ఎపిసోడ్ ప్రసారమైంది.

## ఖో ఖో ప్రపంచకప్ విజేత భారత్

2

## రేషన్ కార్డులకు ఇంకా ఎలాంటి లిస్ట్ రెడీ కాలేదు: భట్టి విక్రమార్క




**ఖమ్మం (ప్రభాత సూర్యుడు):** రేషన్ కార్డులకు ఇంకా ఎలాంటి లిస్ట్ తయారు కాలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఏ లిస్ట్ అయినా గ్రామాల్లోనే తయారవుతుందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడులో ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. జనవరి 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ మొదలవుతుందని తెలిపారు. రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి

..మిగతా 2లో

## 'భారత రాజ్యంతో పోరాటం'

### రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై కేసు నమోదు



**న్యూఢిల్లీ: (ప్రభాత సూర్యుడు):** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై మరో కేసు నమోదైంది. 'భారత రాజ్యంతో పోరాటం' అని ఆయన వ్యాఖ్యానించడంపై అస్సాం రాజధాని గౌహతికి చెందిన ఒక వ్యక్తి ఫిర్యాదు చేశాడు. దేశంలో అశాంతి, వేర్పాటువాద భావాలను రాహుల్ గాంధీ రేకిస్తున్నారని ఆరోపించాడు. ఈ నేపథ్యంలో పలు సెక్షన్ల కింద ఆయనపై కేసు నమోదైంది. జనవరి 15న ఢిల్లీలోని కోట్లా రోడ్డులో కాంగ్రెస్ పార్టీ కొత్త ప్రధాన కార్యాలయం ప్రారంభమైంది. ఈ సందర్భంగా

..మిగతా 2లో



## గంగా నదిలో పడవ బోల్తా

### ముగ్గురు మృతి, నలుగురు గల్లంతు

**పాట్నా (ప్రభాత సూర్యుడు):** గంగా నదిలో పడవ బోల్తా పడింది. ఈ సంఘటనలో ముగ్గురు మరణించారు. మరో నలుగురు గల్లంతయ్యారు. రెస్క్యూ బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. గల్లంతైన వారి కోసం నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. బీహార్‌లోని కతిహార్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం 17 మందితో కూడిన పడవ అమ్దాబాద్ ప్రాంతంలోని గోలాఘాట్ సమీపంలో గంగా నదిలో బోల్తా పడి మునిగింది. అప్రమత్తమైన కొందరు ఈదుకుంటూ నది ఒడ్డుకు చేరుకున్నారు. కాగా, పడవ ప్రమాదం గురించి

..మిగతా 2లో

### అబద్ధాలతో మీ రాజకీయ అవసరం తీరుతుందేమో కానీ..

## రైతుల ఆవేదన తీర్చదు

### హరీశ్‌రావు హితవు



**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** రైతు రుణమాఫీపై సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు మరోసారి నిలదీశారు. రైతులందరికీ రుణమాఫీ అయిపోయిందని ప్రచారం చేసుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి గారూ.. అధికారుల చుట్టూ, బ్యాంకుల చుట్టూ చెప్పులరిగేలా రైతులు తిరుగుతున్న దుస్థితి మీకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అబద్ధపు ప్రచారం మీ రాజకీయ అవసరం తీరుస్తుందేమో గానీ.. రైతుల ఆవేదన తీర్చదని సీఎం

..మిగతా 2లో



### ఆంధ్ర అభివృద్ధికి అహర్నిశలు

## కంకణ బద్ధులమై ఉంటాం

**అమరావతి (ప్రభాత సూర్యుడు):** కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కృష్ణా జిల్లా గన్నవరం మండలం కొండపావులూరులో రూ. 160 కోట్లతో నూతనంగా నిర్మించిన జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ( ఎన్ఐడీఎం), ఎన్డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో అమిత్ షా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కంకణబద్ధులై ఉన్నారని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే

..మిగతా 2లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# రేషన్ కార్డులకు ఇంకా ఎలాంటి లిస్ట్ రెడీ కాలేదు

మొదటి పేజీ తరువాయి...

కుటుంబానికి రేషన్ కార్డులు ఇస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. గ్రామసభల్లోనే లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలందరి సమక్షంలోనే నిష్పక్షపాతంగా, పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారని చెప్పారు. వ్యవసాయ యోగ్యమైన భూములకు ఎలాంటి షరతులు లేకుండా ఎకరానికి రూ.12 వేలు ఇవ్వబోతున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. భూమి లేని నిరుపేద వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.12 వేలు ఇచ్చామని చెప్పారు. ఈ నెల 26 నుంచి మొదలుకానున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గ్రామసభల్లో నిష్పక్షపాతంగా ఎంపిక చేస్తారని పునరుద్ఘాటించారు.



## ఆంధ్ర అభివృద్ధికి అహర్నిశలు
# కంకణ బద్ధులమై ఉంటాం

మొదటి పేజీ తరువాయి...

అమరావతి రాజధాని నిర్మాణానికి 27 వేల కోట్లను హడ్కో, ప్రపంచ బ్యాంక్ ద్వారా రుణాలుగా అందించారని తెలిపారు. విశాఖ స్టీల్ కర్మాగారానికి ఇటీవల రూ.11,440 కోట్లను మంజూరు చేశారని వెల్లడించారు. జాతీయ ప్రాజెక్టు పోలవరానికి నిధులు మంజూరు చేసినందున 2028 నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు పోలవరం జలాలు అందుతాయన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో గ్రీన్ పార్కు నిర్మాణానికి రూ. 2లక్షల కోట్లతో పెట్టుబడులతో పనులు ప్రారంభించారని వివరించారు. విశాఖ రైల్వే జోన్‌ను కూడా పట్టాలెక్కించామని ఆయన అన్నారు. దేశంలో ఉన్న జాతీయ విపత్తు బృందం సమర్ధవంతంగా సేవలందిస్తుందని పేర్కొన్నారు. నేపాల్, తుర్కియే తదితర దేశాల్లో ఎన్డీఆర్ఎఫ్ సేవలు అందించిందని అన్నారు . ఏపీ ఎన్నికల్లో కూటమికి అనూహ్య విజయం అందించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు బండి సంజయ్, రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు.



# పేలిన పెట్రోల్ ట్యాంకర్
## 77 మంది దుర్మరణం

**న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు):** పశ్చిమ ఆఫ్రికా దేశం నైజీరియాలో ఓ పెట్రోల్ ట్యాంకర్ పేలడంతో 77మంది మరణించారు. సెంట్రల్ నైజీరియాలోని నైజర్‌లో ఉన్న సులేజా ప్రాంతంలో కొంతమంది ఓ ట్యాంకర్ నుంచి మరో ట్యాంకర్‌లోకి జనరేటర్ ఉపయోగించి పెట్రోల్ పంపు చేస్తుండగా పేలుడు జరిగింది. దీంతో పెట్రోల్‌ను పంపు చేస్తున్నవారితోపాటు చుట్టుపక్కన పదుల మీటర్ల దూరంలో ఉన్నవారు కూడా మరణించినట్లు నైజీరియా ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ తెలిపింది. ఈ ప్రమాదంలో మరో 25 మంది గాయపడ్డారని పేర్కొంది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించింది. మృతుల్లో చాలామంది గుర్తించలేనంతగా కాలిపోయారని తెలిపింది. సరుకు రవాణాకు సరైన రైల్వే వ్యవస్థ లేకపోవడంతో నైజీరియాలో ఇలాంటి ప్రమాదాలు తరచుగా జరుగుతుంటాయి. రెండు వారాల క్రితం డెల్టా స్టేట్‌లో ఫ్యూయల్ ట్యాంకర్ కోసం జరిగిన అల్లర్లలో ఐదుగురు మరణించారు. అదేవిధంగా గతేడాది అక్టోబర్‌లో పైప్‌లైన్ల నుంచి లీకవుతున్న పెట్రోల్‌ను పట్టుకోవడానికి జనాలు ఎగబడటంతో జరిగిన పేలుళ్లలో సుమారు 153 మంది మృతిచెందారు. నైజీరియాలో ఆర్థిక పరిస్థితులు అంతకంతకూ దిగజారడంతో గత 18 నెలల్లో చమురు ధరలు 400 శాతం పెరిగాయి.




# సైఫ్ అలీఖాన్‌పై దాడి చేసింది బంగ్లాదేశీయుడే!
## కీలక వివరాలు వెల్లడించిన ముంబయి పోలీసులు

**ముంబయి (ప్రభాత సూర్యుడు):** బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి చేసిన నిందితుడు గురించి ముంబయి పోలీసులకు కీలక విషయాలు వెల్లడించారు. ఆదివారం ఉదయం జరిగిన విలేకరుల సమావేశంలో నిందితుడికి బంగ్లాదేశ్‌తో సంబంధాలు ఉండవచ్చని పోలీసులు పేర్కొన్నారు. ఈ నెల 16న తెల్లవారు జామున 2గంటలకు సైఫ్ అలీఖాన్‌పై అతని ఇంట్లోనే దాడి జరిగింది. బాంద్రా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో ఇప్పటికే ఓ నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి పేరు మొహమ్మద్ షరీఫుల్ ఇస్లాం షాజాద్‌గా పేర్కొన్నారు పోలీసులు.

నిందితుడు దొంగతనం చేయాలనే ఉద్దేశంతో ఇంట్లోకి ప్రవేశించాడని.. అతను బంగ్లాదేశ్‌కు చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నట్లు తెలిపారు. అతనివద్ద భారత్‌కు చెందిన గుర్తింపు పత్రాలు లేవని డీసీపీ దీక్షిత్ గేదం తెలిపారు. బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించిన తర్వాత పేరును విజయ్ దాస్‌గా మార్చుకున్నాడని పేర్కొన్నారు.

ఐదారు నెలల కిందట ముంబయికి వచ్చినట్లు వివరించారు. మొదట నిందితుడు హౌస్‌కీపింగ్ ఏజెన్సీలో పని చేసే వాడని పేర్కొన్నారు. నిందితున్ని అరెస్టు చేసిన పోలీసులు.. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి, కస్టడీకి కోరనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ప్రస్తుతం కేసు విచారణ జరుగుతుందన్నారు. నిందితుడిని పోలీసులు శనివారం రాత్రి 2.50గంటలకు థానేలోని హిరానంది ప్రాంతంలో అరెస్టు చేశారు. ఈ ప్రాంతంలోనే కార్మికులతో కలిసి నివాసం ఉంటున్నాడు. బంగ్లాదేశ్ నుంచి భారతదేశానికి రావడానికి అనేకసార్లు తన పేరును మార్చుకున్నాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

# ఆక్వా బిజినెస్‌లో యువ రైతు సూపర్ సక్సెస్

### రాష్ట్రపతి చేతుల మీదుగా సత్కారం!
### యూత్‌కు ఇన్స్పిరేషన్!
### చేపల వ్యాపారంలో రాణిస్తోన్న గిరిజన యువ రైతు
### రిపబ్లిక్ డే రోజు రాష్ట్రపతి చేతుల మీదుగా సత్కారం




**న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు):** మహారాష్ట్రకు చెందిన ఓ గిరిజన యువకుడు చేపల వ్యాపారంలో రాణిస్తున్నాడు. సంప్రదాయ వ్యవసాయంతో పాటు సాంకేతికతను ఉపయోగించి చేపల వ్యాపారంలో అదరగొడుతున్నాడు. యోహన్ అరవింద్ గావిత్ అనే గిరిజన రైతు ప్రస్తుతం యావత్ దేశం దృష్టిని ఆకర్షించాడు. నందుర్బార్ గిరిజనుల ప్రాబల్యం ఉన్న జిల్లా. ఇక్కడ ప్రధాన వృత్తి వ్యవసాయం. మిరప, మొక్కజొన్న, గోధుమ, మినుములు, పత్తి వంటి పంటలను రైతులు ఎక్కువగా పండిస్తారు. అయితే కొందరు రైతులు వ్యవసాయంతో పాటు కోళ్లు, మేకలు, పాల వ్యాపారాన్ని చేస్తుంటారు.

#### 8ఏళ్ల కిందట వ్యాపారం ప్రారంభం

అయితే నందుర్బార్ జిల్లాలోని నవాపుర్ తాలూకాలోని భాద్రేకు చెందిన యోహన్ అరవింద్ గావిత్ ఎనిమిదేళ్ల క్రితం తన సంప్రదాయ వ్యవసాయంతో పాటు చేపల పెంపకం వ్యాపారాన్ని ప్రారంభించాడు. మత్స్య వ్యాపారాన్ని ప్రోత్సహించేందుకు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద ప్రభుత్వం నుంచి 60 శాతం సబ్సిడీ పొందాడు. ఈ పథకం నుంచి అతడికి 18 బోనుల ఏర్పాటుకు సుమారు రూ.32.40 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ ఆర్థిక సాయాన్ని సక్రమంగా వినియోగించుకుని గావిత్ తన గ్రామంలోని సరస్సులో చేపల పెంపకం ప్రారంభించాడు. అందులో విజయం సాధించాడు. చేపల వ్యాపారంలో గావిత్ సాధించిన విజయాలకు గుర్తింపుగా దేశ రాజధాని దిల్లీలో గణతంత్ర దినోత్సవం నాడు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనను సత్కరించనున్నారు.

#### ఆర్థికంగా లాభపడ్డ గావిత్

గావిత్ చేపల వ్యాపారం వల్ల ఆర్థికంగా లాభపడ్డాడు. అంతేకాకుండా తన చేపల చెరువులో చేప పిల్లలను పెంచి రైతులకు సరఫరా చేస్తున్నాడు. అలాగే తోటి రైతులకు చేపల పెంపకానికి సంబంధించిన సలహాలు ఇస్తున్నాడు. గావిత్ ప్రోత్సాహంతో భాద్రే, సమీప గ్రామాల రైతులు చేపల వ్యాపారం వైపు మొగ్గు చూపి సత్ఫలితాలను సాధిస్తున్నారు.

#### దేశవ్యాప్తంగా గుర్తింపు

యోహన్ గావిత్ చేపల వ్యాపారంలో సాధించిన విజయాలు రాష్ట్రస్థాయిలోనే కాకుండా కేంద్ర ప్రభుత్వ స్థాయిలో కూడా ప్రశంసలు అందుకున్నాయి. మహారాష్ట్ర రాష్ట్ర మత్స్య శాఖ జాయింట్ కమీషనర్ ఈ ప్రాజెక్టును పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. ఈ నివేదికలో ప్రాజెక్ట్ విజయవంతమైందని పేర్కొన్నారు. దీంతో రిపబ్లిక్ డే రోజు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము యువరైతు గావిత్‌ను సన్మానించనున్నారు. కాగా, ఇటీవలే కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్, జిల్లా కలెక్టర్ మిట్టాలి సేథీ కూడా ప్రాజెక్టును సందర్శించి యోహన్ గావిత్‌పై ప్రశంసలు కురిపించారు.

#### యోహన్ గావిత్ హర్షం

రాష్ట్రపతి నుంచి ఆహ్వానం అందడంపై యోహన్ గావిత్, అతడి భార్య యశోద సంతోషం వ్యక్తం చేశారు. "ఇది మాకు గౌరవం మాత్రమే కాదు మా గ్రామానికి గర్వకారణం కూడా. ప్రభుత్వ రాయితీని సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా వ్యాపారాన్ని నిర్మించి కుటుంబ ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని నిరూపించాం" అని యోహన్ గావిత్ పేర్కొన్నాడు.

## అబద్ధాలతో మీ రాజకీయ అవసరం తీరుతుందేమో కానీ..
# రైతుల ఆవేదన తీర్చదు

మొదటి పేజీ తరువాయి...

రేవంత్ రెడ్డిని ఉద్దేశించి హరీశ్‌రావు అన్నారు. రుణమాఫీ కాలేదంటూ బాధలు చెప్పుకుంటున్న మెదక్ జిల్లా టెక్మల్ మండల రైతుల వివరాలను మీకు పంపిస్తున్నామని తెలిపారు. రుణాలు మాఫీ చేసి ఈ రైతుల కన్నీళ్లు తుడవాలని సూచించారు. ముఖ్యమంత్రి గారూ రుణమాఫీపై మాట నిలుపుకోండి అని హితవుపలికారు. అంతకుముందు ఆదిలాబాద్ జిల్లాలో మరో రైతు ఆత్మహత్య చేసుకోవడంపైనా హరీశ్‌రావు స్పందించారు. ఆదిలాబాద్ జిల్లాలో 24 గంటలు గడవకముందే రుణభారంతో మరో రైతు రాథోడ్ గోకుల్ ఆత్మహత్య చేసుకోవడం తీవ్రంగా కలచివేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. రుణమాఫీ పూర్తి చేశామని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బ్యాంకుల వేధింపులతో ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల చావులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న ఉసురు ఎందుకు తీస్తున్నారని నిలదీశారు. రైతుల ఆత్మహత్యలు ముమ్మాటికి ప్రభుత్వ హత్యలే అని హరీశ్‌రావు పేర్కొన్నారు. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. రైతులకు భరోసా కల్పించడంలో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విఫలమైందని తెలిపారు. వరుసగా జరుగుతున్న రైతుల ఆత్మహత్యలే దానికి నిదర్శనమని పేర్కొన్నారు. రైతులు దేశానికి వెన్నెముక అని.. అలాంటి రైతుల జీవితాలతో కాంగ్రెస్ సర్కార్ చెలగాటం ఆడుతున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ఇప్పటి వరకు రైతులు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. ఇంత జరుగుతుంటే ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తుండటం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టాడని హరీశ్‌రావు విమర్శించారు. గతంలో రుణమాఫీ కాలేదని అదిలాబాద్ జిల్లా తలమడుగులో నిరసన తెలియజేస్తున్న రైతులను అరెస్టు చేసి, పోలీస్ యాక్ట్ పేరుతో జిల్లాలో నిరసనలు, ఆందోళనలు చేయొద్దని పోలీసులు ఆదేశాలు జారీ చేశారని గుర్తుచేశారు. ప్రశ్నించే గొంతులను అణగదొక్కారని విమర్శించారు. రుణమాఫీ జరగకపోవడంతో రైతులు కలెక్టరేట్లు, వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతూ విసిగిపోతున్నారని అన్నారు. ఉన్న భూములు కుదవ పెట్టి అప్పులు తెస్తున్నారని.. ఆ అప్పులు చెల్లించలేక చివరికి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ అని మభ్య పెట్టి.. 500 బోనస్ అని మోసం చేసి.. పెట్టుబడి సాయన్ని ఎగ్గొట్టడం వల్లే రైతులకు ఈ దురవస్థ వచ్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా మారిందని విమర్శించారు.

ఎద్దు ఏడ్చిన ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం ఏనాడూ బాగుపడలేదన్న విషయం, కాంగ్రెస్ పాలకులు పూర్తిగా మరిచిపోయినట్లున్నారని హరీశ్‌రావు అన్నారు. రైతు సోదరులారా దయచేసి ఆత్మహత్యలు చేసుకోకండి అని విజ్ఞప్తి చేశారు. ఆత్మహత్యలు పరిష్కారం కాదని.. బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగా అందరికీ రుణమాఫీ, రైతు భరోసా, అన్ని పంటలకు 500 బోనస్ హామీలు అమలు చేసే దాకా నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

# ఖో ఖో ప్రపంచకప్ విజేత భారత్



**న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు):** ఖోఖో పురుషుల ప్రపంచకప్ విజేతగా భారత్ నిలిచింది. ఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నేపాల్‌ను భారత జట్టు మట్టికరిపించింది. ఖోఖో ప్రపంచకప్‌ను నిర్వహించడం ఇదే తొలిసారి కాగా.. భారత్ తొలి ప్రపంచకప్‌లోనే విజయం సాధించింది. నేపాల్‌పై 54-36 తేడాతో భారత జట్టు గెలుపొందింది. తొలి టర్న్‌లో 26-0 ఆధిక్యంలో నిలిచింది. టర్న్2లో నేపాల్ పుంజుకొని 18 పాయింట్లు సాధించింది. ఇక టర్న్-3లో ముగిసే వరకు భారత్ 54-36 పాయింట్ల తేడాతో భారత్ విజయం సాధించింది. అంతకు ముందు జరిగిన మహిళల ఫైనల్‌లో నేపాల్‌పై భారత జట్టును గెలుపొందింది. ఫైనల్‌లో భారత్ 78-40 తేడాతో నేపాల్‌ను ఓడించింది. తుది పోరు టర్న్1లో భారత్ దూకుడుగా ఆడింది. దాంతో 34-0 తేడాతో ఆధిక్యంలో నిలిచింది. ఆ తర్వాత నేపాల్ సైతం పుంజుకుంది. దాంతో స్కోర్ 34-24కి చేరింది. మూడో టర్న్‌లో భారత్ మళ్లీ విజృంభించి ఆధిక్యాన్ని 49కి పెంచుకుంది. చివరి టర్న్‌లో 16 పాయింట్లు సాధించగా.. 38 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. ఇక జాతీయ ఖోఖో జట్లకు ఒడిశా స్పాన్సర్‌గా వ్యవహరించింది. భారత ఖోఖో జట్లు విజయం ప్రపంచకప్ గెలువడంతో ఒడిశాలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. మూడేళ్ల స్పాన్సర్‌షిప్‌లో భాగంగా ఒడిశా రూ.5కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది. 2025 నుంచి డిసెంబర్ 2027 వరకు స్పాన్సర్‌షిప్ కాలంలో రూ.15కోట్ల ప్యాకేజీని అందించనున్నది.



## గంగా నదిలో
# పడవ బోల్తా

మొదటి పేజీ తరువాయి...

తెలిసిన వెంటనే పోలీసులు, అధికారులు అక్కడకు చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. నదిలో పడిన పది మందిని రక్షించారు. ఈ సంఘటనలో ముగ్గురు మరణించినట్లు అధికారులు తెలిపారు. ఇద్దరు మృతులను 60 ఏళ్ల పవన్ కుమార్, 70 ఏళ్ల సుధీర్ మండల్‌గా గుర్తించినట్లు చెప్పారు. మరణించిన మరో వ్యక్తిని ఇంకా గుర్తించలేదన్నారు. మరోవైపు పడవ బోల్తాపడిన ఘటనలో నలుగురు వ్యక్తులు గంగా నదిలో గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. వారి కోసం సహాయక, గాలింపు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పడవలో ఎక్కువ మంది ప్రయాణించడం వల్లనే బోల్తా పడి మునిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. పడవ ప్రమాదంపై దర్యాప్తునకు ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ మనేష్ కుమార్ మీనా వెల్లడించారు.

# 'భారత రాజ్యంతో పోరాటం'

మొదటి పేజీ తరువాయి...

రాహుల్ గాంధీ మాట్లాడారు. 'బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రతి సంస్థను స్వాధీనం చేసుకున్నాయి. మేం ఇప్పుడు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తోపాటు భారత రాజ్యంతో పోరాడుతున్నాం' అని అన్నారు. కాగా, రాహుల్ గాంధీ అన్న ఈ వ్యాఖ్యలపై పెద్ద దుమారం చెలరేగింది. అస్సాం రాజధాని గౌహతికి చెందిన మోంజిత్ చెటియా దీనిపై ఫిర్యాదు చేశాడు. రాహుల్ గాంధీ తన వ్యాఖ్యలతో దేశంలో అశాంతి, వేర్పాటువాద భావాలను రేకెత్తిస్తున్నారని ఆరోపించాడు. శాంతి భద్రతలు, జాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పు కలిగించేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో గౌహతిలోని పాన్ బజార్ పోలీస్ స్టేషన్‌లో రాహుల్ గాంధీపై కేసు నమోదైంది. దేశ సార్వభౌమత్వం, ఐక్యత, సమగ్రతను ప్రమాదంలో పడేసే చర్యలకు ఆయన పాల్పడినట్లు అందులో ఆరోపించారు. రాహుల్ గాంధీపై నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



## దైవ దర్శనానికి వెళ్లొస్తుండగా వ్యాన్ బోల్తా..

### 40 మందికి గాయాలు

ఆదిలాబాద్ (ప్రభాత సూర్యుడు): దైవ దర్శనానికి వెళ్లొస్తుండగా వ్యాన్ బోల్తాపడి 40 మందికి గాయాలయ్యాయి. ఈ విషాదకర సంఘటన ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం మాలే బోర్గావ్ వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నార్నూర్ మండలానికి చెందిన గిరిజనులు కెరమెరి మండలం కపిలాయి దైవ దర్శనానికి వ్యాన్‌లో బయలుదేరుతుండగా ప్రమాదం జరిగింది. ఓ మూలమలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడటంతో అందులో ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి. 30 మందిని నార్నో ప్రభుత్వ దవాఖానలో చికిత్స అందించగా మరో పదిమందిని ఆదిలాబాద్‌కు తరలించారు. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరు పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

# ప్రమాదంలో ప్రభుత్వ బ్యాంకులు

న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు): ప్రభుత్వ బ్యాంకులు ప్రమాదంలో పడ్డాయి. రాష్ట్రాలను, ఆయా శాఖల నిపుణులను, పార్లమెంటరీ చర్చలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నది నిజం. ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నా తొలుత పెద్ద నోట్లను రద్దుచేశారు. దీనివల్ల ఏ లక్ష్యమూ నెరవేరకపోగా, సన్న, చిన్న వ్యాపారులు, రైతులు, కూలీలు దారుణంగా నష్టపోయారు. దేశ ఆర్థికవ్యవస్థ కుంగిపోయింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న పలు నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టాయి. దేశ ఆహార భద్రతకు ప్రమాదమని, రైతులు, వ్యవసాయ నిపుణులు, ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టినా పార్లమెంటులో చర్చకు పెట్టకుండానే కేంద్ర ప్రభుత్వం అప్పట్లో వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చింది. వందలమంది అన్నదాతలు చనిపోయాక కానీ ప్రభుత్వం వెనకడుగు వేయలేదు.

ఆర్థిక అసమానతలకు, సంపద కేంద్రీకరణకు, కార్పొరేట్ల గుత్తాధిపత్యానికి దారి తీస్తుందని నిపుణులు నెత్తీనోరు బాదుకున్నా ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలకు, లీజులకు కేంద్రం గేట్లు తెరిచింది. దేశ ఆర్థిక వ్యవస్థకే పెను ప్రమాదమని ప్రపంచబ్యాంకు, భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) హెచ్చరిస్తున్నా బ్యాంకుల ప్రైవేటీకరణకు పూనుకొన్నది. స్టేట్‌బ్యాంక్, యూనియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లను మాత్రం (ప్రస్తుతానికి) ఉంచి మిగిలిన ప్రభుత్వ బ్యాంకులన్నింటినీ కార్పొరేట్లకు అప్పగించబోతున్నది. ఇది దేశానికి దురదృష్టకరం. ఆర్థిక సంక్షోభాల బారిన దేశం పడకుండా బ్యాంకులు ఎన్నోసార్లు కాపాడాయి.

1990 నాటి ఆసియా సంక్షోభం, 1990-2000 నాటి లాటిన్ అమెరికా, జపాన్ సంక్షోభాల నుంచి ఆయా దేశాలను కాపాడింది బ్యాంకులే. ప్రపంచబ్యాంకు నివేదిక 2013 ప్రకారం 2007-08 నాటి ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించడంలో భారతదేశం, చైనా ప్రభుత్వ బ్యాంకులు గణనీయమైన కృషి చేశాయి. ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా వ్యవసాయంతోపాటు చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు గణనీయంగా నిధులు అందించాయి. నాడు ప్రభుత్వ బ్యాంకులన్నీ 100 శాతం లక్ష్యాలను నెరవేర్చడం వాటి ఘన విజయమే. భారత ఆర్థిక వ్యవస్థను కాపాడిన ప్రభుత్వ బ్యాంకులను ఆదర్శంగా తీసుకుని అమెరికా సహా పలు దేశాలు తమ బ్యాంకుల్లో ప్రభుత్వ వాటాలను గణనీయంగా పెంచుకున్నాయి.

1947 నుంచి 1969 వరకు అప్పటి ప్రైవేటు బ్యాంకులు అన్నదాతలకు అందించిన రుణం కేవలం రూ.100 కోట్లు.




బ్యాంకుల జాతీయీకరణ తర్వాత 1969 నుంచి 2020 వరకు వ్యవసాయానికి బ్యాంకులు అందించిన రుణం రూ. 15 లక్షల కోట్లు. నగరాలు, పట్టణాల్లో మాత్రమే ప్రైవేటు బ్యాంకులు సేవలు అందిస్తే, బస్సు కూడా తిరగని మారుమూల పల్లెల్లోనూ ప్రభుత్వ బ్యాంకులు శాఖలు తెరిచి రైతులు, వ్యాపారులకు రుణాలు అందిస్తూ గ్రామీణుల ప్రగతికి బాటలు వేస్తున్నాయి. అంతెందుకు, ప్రభుత్వం గర్వంగా చెప్పుకొనే జనధన్ ఖాతాల్లో 97 శాతం ప్రభుత్వ బ్యాంకుల్లో ఉన్నవే.

ప్రపంచంలోని టాప్‌టెన్ కుబేరుల్లో ఐదుగురు భారతీయులే ఉన్నారు. కానీ వాళ్లలో ఒక్కరి డిపాజిట్లు కూడా ప్రభుత్వ బ్యాంకుల్లో లేవన్నది నిజం. ప్రస్తుతం ప్రభుత్వ బ్యాంకుల్లో ఉన్న రూ.45 లక్షల కోట్ల డిపాజిట్లన్నీ సామాన్య ప్రజలవే. అలాంటి సామాన్యుల డిపాజిట్లకు భద్రత కల్పించే ఎఫ్‌ఆర్‌డీఐ చట్టాన్ని సడలించి ఆ సొమ్మును కూడా కార్పొరేట్ల రుణమాఫీకి తరలించేందుకు కేంద్రం యత్నించింది. అయితే, పెల్లుబికిన ప్రజా వ్యతిరేకతతో ఆ తర్వాత వెనుకడుగు వేసింది. రిజర్వు బ్యాంక్ ఏర్పడిన తర్వాతి నుంచి 1969 వరకు 1500కుపైగా ప్రైవేటు బ్యాంకులు మూతపడ్డాయి. ఇటీవలి కాలంలో గ్లోబల్ ట్రస్ట్ బ్యాంక్, లక్ష్మీ విలాస్ వంటి బ్యాంకులు చేతులెత్తేశాయి. దీంతో డిపాజిటర్లు దారుణంగా నష్టపోయారు. అదే సమయంలో ప్రభుత్వ బ్యాంకులు లాభాల బాటలో పయనిస్తున్నాయి. 2009-10 నుంచి 2019-20 మధ్య ప్రభుత్వ బ్యాంకులు రూ. 14,53,341 కోట్లు ఆర్జించాయి. ఇలా లాభాల్లో ఉన్న బ్యాంకులను ప్రైవేటీకరిస్తే కార్పొరేట్లకే లాభం తప్ప దేశానికి ఒరిగేదేమీ ఉండదు. ప్రభుత్వ బ్యాంకుల్లోని మొండి బకాయిలన్నీ కార్పొరేట్ సంస్థలవే కావడం గమనార్హం. ప్రభుత్వ పెద్దల సిఫారసుతో రుణాలు పొంది బ్యాంకులకు వేలకోట్లు ఎగనామం పెట్టింది ఇవే.

ఇలాంటి ఎగవేతదారులకే కేంద్రం రూ. 7.89 లక్షల కోట్లు మాఫీ చేసింది. నిజానికి పెద్ద బ్యాంకులతోనే దేశానికి అసలు ముప్పు పొంచి ఉన్నది. చిన్న చిన్న బ్యాంకులను విలీనం చేసి పెద్ద బ్యాంకులను చేయాలనుకుంటున్న కేంద్రం ఈ విషయమై ఆలోచించాలి. దీనివల్ల వేలమంది ఉద్యోగాలు కోల్పోతారు. దీనివల్ల మరో ముప్పు ఏంటంటే.. ఎంతపెద్ద బ్యాంకు కుప్పకూలితే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ అంత భారీగా నష్టపోతుందని ఆర్థికరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. 2007-08లో అమెరికా, యూరప్ దేశాల్లోని అతిపెద్ద బ్యాంకులు కుప్పకూలడం వల్లే ఆ దేశాల ఆర్థిక వ్యవస్థలు కుదేలైనట్టు ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అప్పట్లో చెప్పారు.

పారిశ్రామికవేత్తలకు బ్యాంకు లు పెట్టుకునేందుకు లైసెన్సులు ఇస్తామని ఆర్బీఐ-ఐడబ్ల్యూజీ కమిటీ ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని కమిటీలోని 9/10 మంది వ్యతిరేకించినా కేంద్రం పట్టించుకోలేదు. బ్యాంకింగ్ రంగం పారిశ్రామికవేత్తల వశమైతే అది దేశానికే పెను ప్రమాదమన్న వాస్తవాన్ని గుర్తించాలి. అప్పట్లో ఇలాంటి చర్చే అమెరికాలోనూ జరిగినా ఆ తర్వాత వాస్తవాన్ని గుర్తించి ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు.

1930 నుంచి 30 ఏండ్లపాటు విజయవంతంగా పనిచేస్తున్న ప్రభుత్వ బ్యాంకును 1968లో అమెరికా ప్రైవేటీకరించింది. ఈ బ్యాంకుతోపాటు మరో ప్రైవేటు బ్యాంకు కుప్పకూలడం వల్లే అమెరికా ఆర్థిక వ్యవస్థ అప్పట్లో అంతగా కుదేలైంది. ఈ రెండు బ్యాంకుల నిర్వాకం వల్ల 5.4 ట్రిలియన్ డాలర్లను అమెరికన్లు కోల్పోయారు. ఈ బ్యాంకులను తిరిగి గాడినపెట్టేందుకు రెండుసార్లు బెయిలవుట్ ప్రకటించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో గత్యంతరం లేక తిరిగి వాటిని జాతీయం చేసింది. కాబట్టి ఇవన్నీ చూసైనా ప్రభుత్వ బ్యాంకుల ప్రైవేటీకరణను కేంద్రం ఉపసంహరించుకోవాలి.

## ప్రతిపక్షం నిలదీస్తే గానీ.. ప్రభుత్వం నిరుపేదల గురించి ఆలోచించదా?

### హరీశ్‌రావు

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): ప్రతిపక్షం నిలదీస్తే గానీ ప్రభుత్వం నిరుపేదల గురించి ఆలోచించదా అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలన దరఖాస్తులకు కూడా రేషన్ కార్డులు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం బీఆర్ఎస్ విజయమని చెప్పారు. మీ సేవా దరఖాస్తులు కూడా పరిగణనలోకి తీసుకోవాలని, పెరిగిన ద్రవ్యోల్బణం ఆధారంగా రేషన్ కార్డులకు ఆదాయ పరిమితి పెంచాలని డిమాండ్ చేశారు. దరఖాస్తులు చేసుకోవడం నిరంతర ప్రక్రియ అని చెప్పడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ప్రజలను మోసం చేయాలని చూసిన ప్రతిసారి, తాము మిమ్మల్ని ప్రశ్నిస్తుంటాం, నిలదీస్తూనే ఉంటామని ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. 'పేదలకు రేషన్ కార్డులు అందకుండా చేస్తున్నారని, కోతలు విధిస్తున్నారని ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాయడంతో పాటు, పత్రికా సమావేశం నిర్వహించి నిలదీస్తే గాని ఈ ప్రభుత్వానికి జ్ఞానోదయం కాలేదు. కుల గణన దరఖాస్తులతోపాటు, ప్రజాపాలన దరఖాస్తులకు రేషన్ కార్డులు ఇస్తామని చెప్పడం, ఇది తుది జాబితా కాదని, దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ప్రభుత్వంపై ఒత్తిడి చేసి చెప్పించడం బిఆర్ఎస్ విజయం. ఆదాయ పెంపు విషయంలో ప్రభుత్వం మౌనంగా ఉండటం వల్ల లక్షల మంది నిరుపేద వర్గాలు రేషన్ కార్డులకు దూరం అవుతాయని మరొక్క సారి గుర్తు చేస్తున్నాం. కేసీఆర్ అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు పొందేందుకు వీలుగా ఆదాయ, భూ పరిమితి నిబంధనల్లో మార్పులు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆదాయ పరిమితి గ్రామీణంలో 60వేలు, పట్టణంలో 75వేలు ఉంటే, దాన్ని గ్రామీణంలో లక్షా 50వేలకు, పట్టణంలో 2.50 లక్షలకు పెంచారు. మాగాణి రెండున్నర ఎకరాలు, మెట్ట 5 ఎకరాలుగా ఉన్న పరిమితిని మాగాణి మూడున్నరకు, మెట్ట ఏడున్నర ఎకరాలకు పెంచారు. దీనివల్ల లక్షల మంది నిరుపేదలకు రేషన్ కార్డు పొందే అర్హతను కేసీఆర్ ప్రభుత్వం కల్పించింది. పెరిగిన ద్రవ్యోల్బణానికి అనుగుణంగా ఆదాయ పరిమితి తోపాటు భూ పరిమితి పెంచుతూ నిబంధనల్లో మార్పు చేయాలని తెలంగాణ ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని మరోసారి డిమాండ్ చేస్తున్నాం. తద్వారా ఆశాలు, అంగన్‌వాడీలు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, జర్నలిస్టులు.. ఇతర అల్ప ఆదాయ వర్గాలు, పేదలు రేషన్ కార్డులు పొందే వీలు ఉంటుందని స్పష్టం చేస్తున్నాం.ఇతర అల్ప ఆదాయ వర్గాలు, పెదాలు రేషన్ కార్డులు పొందే వీలు ఉంటుందని స్పష్టం చేస్తున్నాం. పల్లెల్లో అయినా పట్టణంలో అయినా కూలీ ఎక్కడైనా నిరుపేదే. కాబట్టి పల్లెలు పట్టణాల్లో పనిచేసే వ్యవసాయ కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తింపజేయాలని, 20 రోజుల పనిదినాల నిబంధన తొలగించాలని, భరోసా పథకాన్ని ఉపాధి హామీకి లింకు చేయకుండా అర్హులైన అందరికీ వర్తింప చేయాలని కోరుతున్నాం. నిరుపేదలకు ఆసరాగా ఉండే రేషన్ కార్డు జారీ ప్రక్రియలో ప్రభుత్వం కోతలు విధించడం సరికాదని హితవు పలుకుతున్నాం.' అని హరీశ్‌రావు ట్వీట్ చేశారు.

# బెంజ్ కారు ఉంటే.. అంబాసిడర్ కారు ఎందుకు ఇచ్చినట్లు?

### బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత




నిజామాబాద్ (ప్రభాత సూర్యుడు): పసుపు బోర్డు ఏర్పాటును స్వాగతిస్తున్నామని, అయితే ఏర్పాటు ప్రకటించిన విధానంపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. పసుపు బోర్డు ప్రారంభోత్సవాన్ని బీజేపీ కార్యక్రమంలా చేశారని మండిపడ్డారు. కనీసం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆహ్వానించకుండా, ప్రొటోకాల్ పాటించకుండా కేవలం బీజేపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ కూర్చొని ప్రారంభించుకున్నారని విమర్శించారు. స్థానిక ప్రజాప్రతినిధులకు కూడా సమాచారం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. నిజామాబాద్‌లో మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, బీఆర్ఎస్ నాయకులతో కలిసి పసుపుబోర్డు ఏర్పాటుపై మీడియాతో మాట్లాడారు. 2014లో తాను ఎంపీగా ఎన్నికైన నెల రోజుల్లోనే అప్పటి వాణిజ్య శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు పసుపు బోర్డు గురించి లేఖ రాసినట్లు గుర్తుచేశారు. ప్రధాని మోదీని రెండు సార్లు కలిశానని చెప్పారు. పసుపు బోర్డుకు ప్రయత్నం చేస్తేనే పసుపు ఆధారంగా రావాల్సిన పరిశ్రమల కోసం కృషి చేశాన్నారు. పసుపుకు రూ.15 వేల మద్ధతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశానని తెలిపారు. ఐదేండ్లు ఎంపీగా త్రిముఖవ్యూహంతో అలుపెరగని పోరాటం చేశానని పేర్కొన్నారు. కేవలం బోర్డు రావడం మాత్రమే సరిపోదని, మద్ధతు ధర ఉంటేనే రైతుకు గిట్టుబాటు అవుతుందని స్పష్టం చేశారు. ఇతర దేశాల నుంచి నాణ్యతలేని పసుపు దిగుమతి అవుతుందని, దాంతో రైతులు నష్టపోతున్నారని చెప్పారు. పసుపు దిగుమతులను నియంత్రించాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నానని వెల్లడించారు. 2014లో 8 లక్షల క్వింటాళ్లు దిగుమతవుతే.. ఇప్పుడది రెట్టింపయ్యింది చెప్పారు. ఏటేటా దిగుమతులు పెరుగుతున్నా బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేవలం రాజకీయం కోసం పసుపు బోర్డు కాకపోతే.. వెంటనే దిగుమతులపై నియంత్రణ విధించాలని డిమాండ్ చేశారు. వెంటనే పసుపుకు రూ.15 వేల మద్ధతు ధర ప్రకటించాలన్నారు. 'ఎంపీ అర్వింద్‌కు వెకిలి మాటలు మాట్లాడడం అలవాటే. తాము పసుపు బోర్డు డిమాండ్ చేసే నాటికి ఆయన అసలు రాజకీయాల్లోనే లేరు. కాంగ్రెస్ పార్టీలో ఆయన తండ్రిచాటు బిడ్డగా ఉన్నారు. ఎంపీగా గెలిస్తే ఐదు రోజుల్లో పసుపు బోర్డు తీసుకొస్తానని బాండ్ పేపర్‌పై రాసిచ్చిన అర్వింద్.. గెలిచిన తర్వాత పసుపు బోర్డు కంటే స్పైసెస్ బోర్డే బాగుటుందన్నారు. తాము కేంద్రంపై పదేపదే ఒత్తిడి చేయడంతోనే ఆ స్పైసెస్ బోర్డు కార్యాలయం ఏర్పాటైంది. అది కూడా ఆయన గొప్పతనమని అర్వింద్ మాట్లాడడం హాస్యాస్పదం. స్పైసెస్ బోర్డు బెంజ్ కారులాంటిది.. పసుపు బోర్డు అంబాసిడర్ కారులాంటిదని అర్వింద్ అన్నారు. ఒకవేళ బెంజ్ కారు ఉంటే.. అంబాసిడర్ కారు ఎందుకు ఇచ్చినట్లు?. ఎందుకు ఇంత వైరాధ్యంతో రకరకాల మాటలు చెబుతున్నారు?. ఎంపీ అర్వింద్ గాలి మాటలు మాట్లాడడం మానేయాలి. ఎవరు ఏం చేయకున్నా ప్రతి మూడో సంవత్సరం పసుపు ధర పెరుగుతుంది. కానీ అది తన ఘనత అని అర్వింద్ చెప్పుకోవడం విడ్డూరంగా ఉంది. రైతాంగాన్ని బీజేపీ మోసం చేయడం ఆపేయాలి. స్పైసెస్ పార్కు ఏర్పాటుకు వేల్పూర్ వద్ద కేసీఆర్ ప్రభుత్వం 42 ఎకరాలు కేటాయించారు. ఆ పార్కులో పసుపు ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి. జాక్రాన్‌పల్లిలో విమానాశ్రయానికి కేసీఆర్ ప్రభుత్వం 800 ఎకరాలు సేకరించింది. అక్కడ ఎయిర్ పోర్టు తీసుకురావాలని' ఎంపీ అర్వింద్‌ను కవిత డిమాండ్ చేశారు.



## ఎమ్మెల్యే కసిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జర్నలిస్టు నాయకులు ఈర్ల చంద్రం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: కల్వకుర్తి నియోజకవర్గం శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా సీనియర్ పాత్రికేయులు, జర్నలిస్టు సంఘం నాయకులు ఈర్ల చంద్రం ఆదివారం ఎమ్మెల్యే నారాయణ రెడ్డి నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేసి, శాలువాతో సన్మానించారు.




## క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం

### మండల కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు మల్లెపంగు శ్రీనివాస్

చిలుకూరు (ప్రభాత సూర్యుడు): మండల వ్యాప్తంగా క్రీడలలో మెరుగగాఉన్న వారిని గుర్తించి ప్రోత్సహించడమే తన లక్ష్యమని చిలుకూరు మండల కమిటీ అసోసియేషన్ అధ్యక్షులు మల్లె పంగుశ్రీనివాస్ అన్నారు ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల ముఖ్య క్రీడాకారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులను వెన్నంటి ప్రోత్సహిస్తాను అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు అనిల్, కట్టెకోల నవీన్, బాలె బోయిన గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## దొడ్డ నర్సయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

చిలుకూరు (ప్రభాత సూర్యుడు): మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ దొడ్డ నరసయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్న చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని సిపిఐ భవన్లో ఆదివారం ఆయన 25వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. రజాకార్ల ఉద్యమంలో పేద ప్రజలను కాపాడుతూ ఉద్యమంలో కీలక భూమిక పోషించారు. చిలుకూరులో అష్టమాంధ్ర మహాసభ నిర్వహించి చరిత్ర పుటల్లో ప్రత్యేక స్థానాన్ని ఏర్పరిచారు. పార్టీ సీనియర్ నాయకులు దొడ్డ నారాయణరావు, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మండల వెంకటేశ్వర్లు జిల్లా మండల నాయకుల కొండ కోటయ్య, దొడ్డ వెంకటయ్య, చేవూరు కొండలు, గంగాధర్ ,ఆంజనేయులు, రాంబాబు, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల బరిలో 719 మంది అభ్యర్థులు

### కేజ్రీవాల్ స్థానంలో అత్యధికంగా పోటీ



న్యూఢిల్లీ (ప్రభాత సూర్యుడు): దేశ రాజధాని ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు 719 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఆప్ అధిపతి, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పోటీ చేస్తున్న న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి అత్యధిక సంఖ్యలో పోటీ చేస్తున్నారు. మొత్తం 1,040 నామినేషన్లు దాఖలయ్యాయి. ఉప సంహరణ గడువు తర్వాత 981 నామినేషన్లను ఎన్నికల అధికారులు పరిశీలించారు. స్క్రూటినీ తర్వాత 477 నామినేషన్లను తిరస్కరించారు. దీంతో 719 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. కాగా, ఇద్దరు ఢిల్లీ మాజీ సీఎంల కుమారులైన బీజేపీకి చెందిన పర్వేష్ వర్మ (సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు), కాంగ్రెస్‌కు చెందిన సందీప్ దీక్షిత్ (షీలా దీక్షిత్ కుమారుడు) న్యూఢిల్లీ స్థానంలో అరవింద్ కేజ్రీవాల్‌తో తలపడుతున్నారు. అయితే ఈ స్థానం నుంచి అత్యధికంగా అభ్యర్థులు పోటీలో ఉన్నారు. గరిష్టంగా నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 29 మంది అభ్యర్థులు 40 నామినేషన్లు దాఖలు చేశారు. చివరకు 23 మంది పోటీలో నిలిచారు. మరోవైపు పటేల్ నగర్, కస్తూర్బా నగర్ స్థానాల్లో అత్యల్పంగా 5 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. ఫిబ్రవరి 5న ఢిల్లీలో ఒకే దశలో పోలింగ్ జరుగనున్నది. ఫిబ్రవరి 8న కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## సంపాదకీయం EDITORIAL

## కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంపీ ఈటల సంచలన ఆరోపణలు



హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): తన రాజకీయ జీవితంలో ఇంత అసమర్థ,అవినీతి ప్రభుత్వాన్ని చూడలేదని తెలంగాణ ప్రభుత్వాన్ని ఉద్దేశించి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ఆదివారం(జనవరి19) బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈటల మీడియాతో మాట్లాడారు. ఆర్థిక శాఖలో కమిషన్ లేకుండా ఒక్క బిల్లు మంజూరు చేయడం లేదని, 7నుంచి10శాతం కమిషన్ లేనిదే చిన్న బిల్లు కూడా ఇవ్వడం లేదని సంచలన ఆరోపణలు చేశారు. 'ఇళ్లలో ఉండే వాళ్ళు కూడా దుకాణాలు ఓపెన్ చేశారు. మళ్లీ దొరుకుతదో దొరకదో అన్నట్లు దోచుకుంటున్న ప్రభుత్వం ఇది. రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడించడం ఎవరితరం కాదు. తెలంగాణలో రానున్న శకం బీజేపీది.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొన్ని నెలల పాటు 'హై డ్రా' పేరిట పేదల ఇండ్లు కూల్చింది.కొన్ని నెలల పాటు మూసీ పేరిట ఇండ్లు కూల్చింది. ఈ మధ్య కాలంలో దేశంలోనే పెద్దదైన,అతి పురాతనమైన స్లమ్ బాలాజీనగర్,జవహర్ నగర్ స్లమ్ ఏరియాల్లో ఈ ప్రాంతంలో రాష్ట్ర ప్రజలతో పాటు దేశవ్యాప్తంగా వలస వచ్చిన ఎంతోమంది కూలీలు,పేదలు నివసిస్తున్నారు.ఇక్కడి ప్రజలు కబ్జా చేసుకుని ఇండ్లు కట్టుకోలేదు.డబ్బులు పెట్టి కొని కట్టుకున్నారు.బ్రిటీష్ కాలంలో ఈ భూమిని సైనికులకు కేటాయించారు.ఆ భూమిపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి హక్కు లేదు..కేర్ టేకింగ్ మాత్రమే చేపట్టాలని 1951లోనే స్పష్టంచేశారు.సైనికులు కొందరు ఆ భూమిని అమ్ముకుంటే వారి నుంచి పేదలు కొనుక్కున్నారు. గతంలోనూ కాంగ్రెస్ మంత్రి కమటం రాంరెడ్డి ఆ ప్రాంతంలో ఇండ్లను కూల్చాలని మిషన్లను పంపారు.మళ్లీ ఇప్పుడు రేవంత్ కూల్చివేతలు చేస్తున్నారు.బాలీజీ నగర్‌లో పేదల ఇండ్లను కబ్జా చేసుకునేందుకు,అమ్మకాలు,కొనుగోలు చేసే బ్రోకర్లు ఎక్కువైపోయారు.రెవెన్యూ అధికారుల ఆగడాలు ఎక్కువైపోయాయి.డబ్బులు ఇస్తే తప్పా మీ ఇండ్లు కూల్చివేతలు ఆగవని విమర్శించారు.

# పసుపు బోర్డు ముందు ఎన్నో సవాళ్లు

**నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు వెనక బీఆర్ఎస్ కృషి అడుగడుగునా ఉన్నది. ఉమ్మడి ఏపీలో కేసీఆర్ పార్లమెంటు సభ్యుడిగా ఉన్నప్పుడే పసుపు బోర్డు డిమాండ్‌ను తెరపైకి తీసుకొచ్చారు. ఆ తర్వాత కవిత కూడా దీనిపై పోరాటం చేశారు. పసుపు రైతులు, బీఆర్ఎస్ కలిసి చేసిన పోరాటాలతో ఉలిక్కిపడిన బీజేపీ గత ఎన్నికల్లో ఇదే అంశంతో నిజామాబాద్ పార్లమెంటు బరిలో దిగి విజయం సాధించినప్పటికీ ఆ తర్వాత ఆ విషయాన్ని అటకెక్కించింది.**




పసుపు బోర్డు ఏర్పాటు అంశంలో బీఆర్ఎస్ పాత్ర చాలా కీలకం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కేసీఆర్ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడు పసుపు బోర్డు కోసం అప్పటి కేంద్ర ప్రభుత్వాన్ని పలుమార్లు డిమాండ్ చేశారు. 2014లో రాష్ట్ర ఏర్పాటు తర్వాత వ్యవసాయ రంగంపై బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. అందులో భాగంగా పసుపు బోర్డు ఏర్పాటు అంశాన్ని తెరపైకి తీసుకొచ్చి కేంద్రంపై ఒత్తిడి పెంచింది. పార్లమెంట్‌లో బీఆర్ఎస్ సభ్యులు పలుమార్లు దీనిపై చర్చకు పట్టుబట్టారు. నిజామాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులు కవిత అధ్యక్షతన ప్రధాని నరేంద్రమోదీని కలిసి వినతులు ఇచ్చారు. కానీ కేంద్రం మాత్రం స్పందించలేదు. ఇక్కడ బోర్డు ఏర్పాటు చేస్తే ఇతర బోర్డులపై ప్రభావం పడుతుందని వాదించింది. అయితే, 2019 సార్వత్రిక ఎన్నికల్లో నిజామాబాద్‌లో ఇదే ప్రధానాంశమైంది. ఆ ఎన్నికల్లో అక్కడ బీజేపీ గెలిచిన తర్వాత మళ్లీ ఈ అంశం మరుగున పడింది. అయితే, రైతుల నుంచి ఆందోళనలు తీవ్రతరం కావడం, ఆర్మూర్, జగిత్యాల ప్రాంతాల్లో రైతులు ఆందోళనలకు దిగడం, మరోవైపు బీఆర్ఎస్ ఒత్తిడి వెరసి పసుపు బోర్డుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నో పోరాటాలు, మరెన్నో వినతుల తర్వాత తెలంగాణలో పసుపు బోర్డును ఎట్టకేలకు ప్రారంభించింది.

పసుపు ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణది మొదటి స్థానం. ఉత్తర తెలంగాణ ప్రాంతంలో నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాలో పసుపు అధికంగా పండిస్తారు. పండిన పంటను ఇతర రాష్ట్రాలకు పంపించి అక్కడి నుంచి ఎగుమతి చేసేవారు. దీనివల్ల మన రైతులకు సరైన ధర లభించక నష్టపోయేవారు. 2016–17లో అప్పటి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యురాలు కవిత అనేకసార్లు కేంద్ర పెద్దలను కలిసి పసుపు బోర్డు కోసం వినతులు ఇచ్చారు. అయితే, 2022లో పసుపు బదులు సుగంధ ద్రవ్యాల బోర్డును ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. దీంతో రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఇప్పుడు ఎట్టకేలకు తెలంగాణ భౌగోళిక, ఆర్థిక లబ్ధి తదితర అంశాల దృష్ట్యా కేంద్రం ఎట్టకేలకు పసుపు బోర్డును ప్రారంభించింది.

మన రాష్ట్రంలో దాదాపు 25 రకాల పసుపును పండిస్తారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఆయుష్ మంత్రిత్వశాఖ ప్రపంచ సంప్రదాయ మందుల కేంద్రం (గ్లోబల్ ట్రెడిషనల్ మెడిసినల్ సెంటర్) ద్వారా పసుపునకు ప్రోత్సాహకాలు కల్పించే అవకాశాలున్నాయి. ఔషధ గుణాలు అధికంగా ఉన్నందువల్ల అనేక ఆహార, ఔషధ రంగాల పరిశ్రమలకు ఒక థింక్ ట్యాంక్‌గా ఈ బోర్డు పనిచేయనుంది. ఉద్యోగ కల్పన, గ్రామీణ సహకార సంఘాలకు పెట్టుబడి సాయం, గ్రామీణ నిరుద్యోగ నిర్మూలన వంటివి జరగనున్నాయి. అలాగే, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని ప్రాంతీయ బోర్డులకు ఇది కేంద్రంగానూ పనిచేయనుంది. రైతుల కన్సార్షియం ద్వారా అధిక లాభాలకు కూడా ఇది దోహదం చేస్తుంది. భారత్ తర్వాత ప్రపంచంలో అత్యధికంగా పసుపును పండించే దేశాలైన చైనా, మయన్మార్, నైజీరియా దేశాలతో మనం ఎంవోయూ కుదుర్చుకొనే అవకాశాలు కూడా మెరుగుపడతాయి. లాజిస్టిక్స్ హబ్ , రవాణా సౌకర్యాలు సైతం మెరుగుపడే అవకాశాలు ఉన్నాయి. బోర్డు ఏర్పాటుతో పాటు ఒక పరిశోధన కేంద్రం, ఎగుమతి ప్రోత్సాహక వృద్ధి కేంద్రాలు (ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ గ్రోత్ కౌన్సిల్), సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. రైతులకు పసుపుపై మద్దతు ధర (ఎంఎస్పీ)ను అధికంగా ప్రకటించినప్పుడే వారికి న్యాయం జరుగుతుంది. మన రాష్ట్రంలో పసుపును అధికంగా పండిస్తున్నప్పటికీ పసుపు వంగడాలు మాత్రం కర్ణాటక, తమిళనాడు నుంచే వస్తున్నాయి. కాబట్టి బోర్డు ఇక్కడ ఉన్నప్పటికీ అక్కడి రైతులకు అధికంగా లబ్ధి చేకూరే అవకాలున్నాయి. ఈ సవాళ్లను బోర్డు ఎలా అధిగమిస్తుందో చూడాలి. తెలంగాణ భూపరివేష్టిత (ల్యాండ్ లాక్డ్) రాష్ట్రం కావడం వలన ఎగుమతులకు కొంత అంతరాయం ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. దీనికి తగ్గట్టుగా డ్రై పోర్టులను నిజామాబాద్ జిల్లాలోనే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అలాగే, ట్రాన్సిట్ కారిడార్లను ఏర్పాటు చేయాలి. ఆర్గానిక్ రకమైన పసుపు విత్తనాలను సైతం ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఈ విధంగా దేశంతో పాటు మన రాష్ట్ర రైతులకు లబ్ధి చేకూరేలా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జాతీయ పసుపు బోర్డు ముందుకు సాగాలని కోరుకుందాం.

# పనిగంటలు దేశగతిని మారుస్తాయా?



ఒకరేమో వారానికి 70 గంటలు పనిచేయమంటారు. మరొకరు ఇంకో అడుగు ముందుకేసి 90 గంటలు పనిచేయమంటారు. దేశం అభివృద్ధి పథంలో పయనించేందుకు ఉన్న ఒకే ఒక్క మంత్రం ఇదేనంటారు. కానీ, వారానికి 48 గంటలు పనిచేస్తూనే ప్రపంచం నివ్వెరపోయే ప్రగతి సాధించామన్న విషయాన్ని వారు మర్చిపోతున్నారు. అంతేకాదు, రోజంతా ఆఫీసుల్లోనే ఉండి రోబోల్లా పనిచేస్తూ పోతే దేశం అభివృద్ధి సంగతి దేవుడెరుగు, తలెత్తే మానసిక, ఆరోగ్య సమస్యల సంగతేంటన్న ప్రశ్న ఉత్పన్నమవుతుందన్న విషయాన్ని వారు మర్చిపోతున్నారు.

ఉద్యోగులు వారానికి 70 గంటలు పనిచేస్తే దేశం గొప్ప పురోగతి సాధిస్తుందని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి గతంలో ప్రకటించి దేశవ్యాప్త చర్చకు కారణమయ్యారు. తాజాగా, ఎల్అండ్‌టీ చైర్మన్ సుబ్రహ్మణ్యన్ ఒకడుగు ముందుకు వేసి వారానికి 90 గంటలు పనిచేయాలని సెలవిచ్చి అందరినీ దిగ్భ్రాంతికి గురిచేశారు. నిజానికి ఫ్యాక్టరీల చట్టం 1948 ప్రకారం వారానికి 48 గంటలు మించి పనిచేయకూడదు. ఈ చట్టాలను అనుసరిస్తూనే 75 ఏండ్లలో దేశం అనూహ్య ప్రగతి సాధించింది. ఈ నేపథ్యంలో ఈ ఇద్దరు కార్పొరేట్ దిగ్గజాలు భారత శ్రామికులను వారానికి 70 నుంచి 90 గంటలు పనిచేయాలని సూచించడం ఎంతమాత్రం హేతుబద్ధంగా, ఆచరణాత్మకంగా కనిపించడం లేదు. సుబ్రహ్మణ్యన్ చెప్తున్న దాని ప్రకారం వారానికి 90 గంటలు పనిచేయడమంటే రోజుకు 12 గంటలకు పైగా శ్రమపడాల్సి ఉంటుంది. నారాయణమూర్తి 70 గంటల ప్రతిపాదనను ఎంతోమంది విమర్శించారు. ఇప్పుడు సుబ్రహ్మణ్యన్ అంతకుమించి విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. సోషల్ మీడియా ఆయనపై జోక్స్, మీమ్స్‌తో విరుచుకుపడింది. గతంలో ఎలాన్ మస్క్, జాక్ మా కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసి విమర్శల పాలయ్యారు.

48 గంటల పని విధానం దేశంలో కొనసాగుతున్నప్పటికీ నగర, పట్టణ ప్రాంతాల్లోని కంపెనీ ఉద్యోగులు తగిన వేతనం పొందకుండానే పరిమితికి మించి పనిచేస్తున్న మాట వాస్తవం. ఉద్యోగులు కష్టపడి పనిచేస్తూ దేశాన్ని ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ స్థాయికి తీసుకెళ్లారు. సాధారణ పనిదినాల అమలు చట్టాలు వర్తించని రీతిలో 88 శాతం మంది భారత ఉద్యోగులను కంపెనీలు నియమించుకుంటున్నాయని ఇండీడ్ అనే గ్లోబల్ సంస్థ సర్వేలో తేలింది. ప్రభుత్వ సెలవు దినాలు, సిక్ లీవ్‌లో ఉన్నప్పుడు కూడా కంపెనీ యాజమాన్యాలు తమతో పనిచేయించుకుంటున్నాయని 85 శాతం మంది ఉద్యోగులు చెప్పినట్టు సర్వే పేర్కొన్నది. విధులు ముగిశాక యాజమాన్యాలు పంపే సందేశాలకు స్పందించకుంటే ప్రమోషన్లు వంటి ప్రయోజనాలను ఎక్కడ కోల్పోతామోనన్న భయం ఉద్యోగులను వెంటాడుతూ ఉంటుంది. కొన్ని రంగాల్లో ఉద్యోగులు ఇప్పటికే పనికి సంబంధించి కంపెనీ ఆదేశాలు పాటించేందుకు రోజంతా అందుబాటులో ఉంటున్నారు. కొందరు అదనపు జీతభత్యాలు పొందకుండానే నిర్దేశిత పని గంటలకు మించి శ్రమపడుతున్నారు. కానీ, పదిహేను అగ్రశ్రేణి గ్లోబల్ టెక్ కంపెనీల ఉద్యోగులు వారానికి 50 గంటల లోపే పనిచేస్తుండటం గమనార్హం. 'ఓవర్‌టైమ్' కారణంగా అత్యధిక మరణాలు సంభవించే దేశాల్లో ఇండియా ముందు వరుసలో ఉందని అంతర్జాతీయ కార్మిక సంస్థ, ప్రపంచ ఆరోగ్య సంస్థ సంయుక్త సర్వేలో వెల్లడైంది.

సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తడంతో ఎల్అండ్‌టీ స్పందించింది. అసాధారణ ఫలితాలు సాధించేందుకు అసాధారణ ప్రయత్నాలు చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పడానికి మాత్రమే సుబ్రహ్మణ్యన్ ఆ వ్యాఖ్యలు చేశారని చెప్పుకొచ్చింది. అభివృద్ధి చెందిన దేశంగా ఇండియాను ముందుకు తీసుకెళ్లడానికి మరింత అంకితభావంతో పనిచేయాలనేదే ఎల్ అండ్ టీ లక్ష్యమని, కంపెనీ ఉద్దేశాన్ని, విస్తృత లక్ష్యాలను చైర్మన్ వ్యాఖ్యలు ప్రతిబింబిస్తున్నాయని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఇక నారాయణమూర్తి వారానికి 70 గంటల పని విధానం ప్రతిపాదనపై ప్రముఖ ఐటీ కంపెనీ జోహో కార్పొరేషన్ సీఈవో శ్రీధర్ వెంబూ తీవ్రంగానే స్పందించారు.

'జపాన్, దక్షిణ కొరియా, తైవాన్, చైనాలు మితిమీరిన శ్రమతో అభివృద్ధి సాధించాయి. ఇవి తమ ప్రజలను శిక్షించే స్థాయిలో పనిభారం మోపాయి. ఆఫీసుల్లో, ఫ్యాక్టరీల్లో రెక్కలుముక్కలు చేసుకుని జనం పనిచేసిన కారణంగా ఈ దేశాల్లో జనాభా బాగా తగ్గిపోతున్నది. ఫలితంగా అక్కడి ప్రభుత్వాలే ప్రజలను ఇంకా ఎక్కువ పిల్లలను కనండి అని వేడుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది' అని విరుచుకుపడ్డారు. ఎక్కువ గంటలు కష్టపడి పనిచేస్తూ అభివృద్ధి సాధించిన దేశాల్లోని ప్రజలు వృద్ధాప్యంలో ఒంటరిగా బతకాల్సిన పరిస్థితి వస్తుందని ఆయన హెచ్చరించారు. కంపెనీల రథసారథులు కొద్దిమంది ఎక్కువ గంటలు పనిచేస్తే చాలని, ఉద్యోగులంతా ఒళ్లు హూనం చేసుకుని శ్రమిస్తే వ్యతిరేక ఫలితాలు తప్పవని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్థిక ప్రగతిలో ఇండియాకు చైనా ఎన్నటికీ ఆదర్శం కాకూడదని వెంబూ చేసిన హెచ్చరిక హేతుబద్ధంగా కనిపిస్తున్నది.

మూర్తి, సుబ్రహ్మణ్యన్ చెప్పినట్టు రోజుకు అందరూ సగటున పది గంటలు పనిచేస్తే ఆయుష్షు కూడా తగ్గిపోయే అవకాశం ఉన్నదని చెప్తున్నారు. అధిక పనిగంటల వల్ల మానసిక, శారీరక ఒత్తిడి పెరుగుతుంది. అప్పుడు సామాజిక జీవితం అంటూ ఏమీ మిగలదన్నది అత్యధికుల మాట. భారత శీఘ్ర ఆర్థిక ప్రగతికి ఈ ఇద్దరు దక్షిణాది కార్పొరేట్ దిగ్గజాలు ఒకే తీరున సూచించిన పరిష్కార మార్గాలను పరిశీలిస్తే ఇండియాలో 1970, 80లలో ప్రచారంలో ఉన్న ఒక వింత పుక్కిటి పురాణం పాత తరం వారికి గుర్తుకొస్తున్నది. అప్పట్లో జపాన్ అనేక రంగాల్లో అమెరికా, ఐరోపా దేశాలను తలదన్నే రీతిలో ఆర్థికాభివృద్ధి సాధించడం మొదలైంది. దానికి కారణం జపాన్‌లో కార్మికులకు కంపెనీల యాజమాన్యాలపై అసంతృప్తి, ఆగ్రహం వస్తే పని బంద్ చేసి సమ్మెలకు దిగకుండా ఫ్యాక్టరీల్లో ఎక్కువ గంటలు పని చేసేవారనే ప్రచారం దేశవ్యాప్తంగా నడిచింది.



### ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడేది

## 2023 ప్రపంచకప్ జట్టే!

### మారింది నలుగురు ప్లేయర్స్ మాత్రమే సుమీ!

ఏడాది ఫిబ్రవరిలో జరుగనున్న చాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, కెప్టెన్ రోహిత్ శర్మ శనివారం ముంబయిలో 15 మంది సభ్యుల జట్టును ప్రకటించారు. అయితే, ఇందులో పెద్దగా మార్పులేమీ కనిపించలేదు. దాదాపు 2023లో జరిగిన వన్డే వరల్డ్ కప్‌లో పాల్గొన్న జట్టు సభ్యులే ఉన్నారు. కొత్తగా నలుగురి ఆటగాళ్లను తప్పించి.. వారి స్థానంలో మరో నలుగురికి స్థానం కల్పించింది. ఈ నలుగురిలో ఇద్దరు కొత్తగా ఐసీసీ వన్డే టోర్నీలో ఆడనున్నారు.

ఛాంపియన్స్ ట్రోఫీ 2025కి ఎంపికైన జట్టులో వన్డే ప్రపంచ కప్ జట్టులో ఉన్న కెప్టెన్ రోహిత్ శర్మ, వైస్ కెప్టెన్ శుభ్‌మాన్ గిల్, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమీ, రవీంద్ర జడేజా ఉన్నారు. కొత్తగా వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్, యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్ చేరారు. ఈ నలుగురికి ఇదే తొలి చాంపియన్స్ ట్రోఫీ కావడం విశేషం. అయితే, అర్ష్‌దీప్, పంత్ ఇంతకు ముందు ఐసీసీ టోర్నీల్లో ఆడిన అనుభవం ఉంది. కానీ, యశస్వి జైస్వాల్, వాషింగ్టన్ సుందర్‌కు ఇదే మొదటి ఐసీసీ టోర్నీ. 2023 వన్డే ప్రపంచ కప్ జట్టులో, ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్, శార్దూల్ ఠాకూర్, మహ్మద్ సిరాజ్ స్థానాల్లో ఈ నలుగురికి చోటు దక్కింది. హార్దిక్ గాయం కారణంగా దూరం కాగా.. శార్దూల్ ఠాకూర్‌కు అవకాశం వచ్చింది.

**వరుసగా మూడోసారి..**

కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా వరుసగా మూడో చాంపియన్స్ ట్రోఫీ ఆడుతున్నారు. 2013లో టీమిండియా చాంపియన్స్ ట్రోఫీని నెగ్గింది. ఆ జట్టులోనే ఈ ముగ్గురు సైతం ఉన్నారు. టీమిండియా 2017లోనూ చాంపియన్స్ ట్రోఫీలో ఫైనల్‌కు చేరిన జట్టులోనూ ముగ్గురు ఉన్నారు. తాజాగా ఈ ఏడాది జరుగనున్న ఐసీసీ ఈవెంట్‌లోనూ ఆడనున్నారు. వీరితో పాటు ప్రస్తుత జట్టులో చాంపియన్స్ ట్రోఫీ ఆడిన అనుభవం ఉన్న ఏకైక ఆటగాడు హార్దిక్ పాండ్యా మాత్రమే. హార్దిక్ 2017 ఛాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టులో ఉన్నాడు. మిగతా 11 మంది ఆటగాళ్లు తొలిసారిగా చాంపియన్స్ ట్రోఫీ ఆడబోతున్నారు.



## ఇండియా కూటమి ఖేల్ ఖతం

గత లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీ అప్రతిహత ప్రస్థానాన్ని నిలువరించే ఏకైక లక్ష్యంతో కాంగ్రెస్ నాయకత్వంలో ఏర్పడిన కలగూర గంపలాంటి ఇండియా కూటమి ఆశలుడిగిపోయి అవసాన దశకు చేరుకున్నది. కూటమి మిత్ర పక్షాలు కాంగ్రెస్‌ను మోయరాని భారంగా భావిస్తుండటమే అందుకు కారణమని చెప్పాలి. ముఖ్యంగా హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నిరాశాజనకంగా ఉండటంతో విభేదాలు తీవ్రమయ్యాయి. లోక్‌సభ ఎన్నికలు మరో నాలుగేండ్ల తర్వాత కానీ జరగవు. అంతవరకు కాంగ్రెస్‌తో 'సహజీవన భారాన్ని' మోసే ఓపిక మిత్ర పక్షాలకు నశిస్తున్నది. దాంతో క్రమక్రమంగా ఒక్కరొక్కరు కాంగ్రెస్ నుంచి దూరమవుతున్నారు. ముందుగా ఆప్ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు లేకుండానే పోటీ చేస్తామని తేల్చి చెప్పింది. ఇండియా కూటమి మిత్రపక్షాలైన టీఎంసీ, ఎస్పీ ఆప్‌కు మద్దతు తెలిపాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆప్ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్‌పై అనూహ్య రీతిలో చేసిన విమర్శలే ఈ చీలికకు దారితీశాయి. ఫలితంగా కాంగ్రెస్ ఒంటరైంది.

ఇక మహారాష్ట్రలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇండియా కూటమి లేదా స్థానిక రూపమైన మహారాష్ట్ర వికాస్ అఘాడీ (ఎంవీఏ) ఉమ్మడి పోటీ అనేది జరగబోదని తేటతెల్లమైంది. బృహన్ముంబై మునిసిపల్ కార్పొరేషన్ సహా పట్టణ సంస్థలకు, జిల్లా పరిషత్‌లకు ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తామని శివసేన (ఉద్ధవ్) ప్రకటించింది. కాంగ్రెస్‌తో పొత్తు ఉండదని స్పష్టం చేయడం ఇండియా కూటమికి పెద్ద దెబ్బ. మిత్రపక్షాల మద్దతుతో అంతోఇంతో లబ్ధి పొందుదామనుకుంటున్న కాంగ్రెస్‌కు మరీ పెద్ద దెబ్బ. అతిపురాతన పార్టీ ఏకాకితనం స్వయంకృతమేనని చెప్పక తప్పదు. తనకు లేని బలాన్ని ఊహించుకుని అధిక సీట్లు రాబట్టుకోవడం, గెలవలేక చతికిల బడటం వంటివి ఇందుకు దారితీశాయి. రాహుల్ పరిపక్వ శైలి దీనికి ఆజ్యం పోసింది.

ఈ పరిస్థితుల్లో ఇండియా కూటమి జాతీయ ఎన్నికలకు మాత్రమే పరిమితమని మహారాష్ట్ర రాజకీయ కురువృద్ధుడైన శరద్ పవార్ ప్రకటించడం కీలక పరిణామం. ఆచరణాత్మకంగా చూస్తే ఇండియా కూటమి కథ ముగింపునకు వచ్చినట్టేనని అవి సూచిస్తున్నాయి. పరస్పర విరుద్ధమైన భావజాలాలున్న పార్టీలు కేవలం బీజేపీ వ్యతిరేకత అనే ఏకసూత్ర కార్యక్రమం మీదే కూటమిగా ఏర్పడి లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేసినా ఫలితం దక్కలేదు. అవసరమైన సందర్భాల్లో రాజీ పడటం, అన్ని పార్టీలను ఏకతాటిపై నడపడం వంటి కూటమి ధర్మాలను పాటించడంలో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా విఫలమైందనేది విస్పష్టం. పైగా ఆ పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటక, తెలంగాణల్లో హామీల అమలు అనేది హాస్యాస్పదంగా తయారై తీవ్రమైన ప్రజాగ్రహానికి గురవుతున్నది. హామీల డొల్లతనం మీదే బీజేపీ తన అస్త్రాలను సంధించడం మహారాష్ట్రలో కూటమికి ప్రతికూలంగా పనిచేయడం తెలిసిందే. ఇవన్నీ వెరసి కూటమిని లోపల నుంచి కూల్చివేస్తున్నాయి. ఎవరికి వారే కావడంతో కూటమి కథ దాదాపుగా ముగిసిపోయింది.

Printed, Published and Owned by CHERUKU UPENDER, Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad - 500 013 Telangana.
Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin:501505,
Rangareddy District/Hyderabad City, Telangana. E-mail:upendrabbk@gmail.com RNI: TELTEL12215